పుస్తకాలయానికి కడివెడు కష్టాలు



మండల కేంద్రంలో గ్రంథాలయం

- శిథిలావస్థలో గ్రంథాలయ భవనం
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- పుస్తకాలు, సామగ్రి తడిచిపోతున్న వైనం
- వాటిని భద్రపరచడానికి సిబ్బంది పాట్లు

నాతవరం : మండల కేంద్రంలో గల గ్రంథాయయం శిథిలమై ఏసమయంలో కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. మండల కేంద్రంలో 1987లో గ్రంథాలయ భవనం నిర్మించారు. మండల వ్యాప్తంగా ఎక్కడా గ్రంథాలయం లేకపోవడంతో పాఠకులంతా ఇక్కడకే వస్తుంటారు. ఎంతో మందికి ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడిన గ్రంథాలయం ప్రస్తుతం శిథిలం కావడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం శ్లాబు పెచ్చులూడిపోయి పడడంతో శ్లాబు లోపల ఉన్న ఐరన్ ఊసలు బయటకు కన్పిస్తున్నాయి. ఏమాత్రం వర్షం పడినా నీరంతా గదులోనే ఉంటుంది. వర్షం పడినప్పుడల్లా సిబ్బంది పుస్తకాలు తడిసిపోకుండా భద్రపరుచుకునేందుకు అనేక బాధలు పడుతున్నారు. రాత్రి సమయంలో భారీ వర్షం పడినప్పుడల్లా గ్రంథాలయం లోపల సామాగ్రి అంతా తడిసిపోవడంతో ఆ రోజు పేపర్లు ఇతర పుస్తకాలు చదుకోవడం ఉండదు. గదులతో పాటు చుట్టు వరండాల్లో కూడా శ్లాబు పెచ్చులూడిపోవడంతో క్షణం క్షణం భయంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఈ భవనం నిర్మాణం చేసిన దగ్గర్నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. గతంలో దివంగత నేత వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు అంకంరెడ్డి జెమీలు భార్య అంకంరెడ్డి పార్వతి సర్పంచ్ సమయంలో గ్రంథాలయానికి విద్యుత్ సదుపాయం కల్పించారు. అప్పట్లో శిథిలమైన వరండాలు ప్రహరీ గోడ నిర్మాణం వంటి పనులు చేపట్టారు. అప్పట్లోనే శ్లాబుతో పాటు భవనం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు చేశారు. అప్పట్లో చేసిన ప్రతిపాదనలు నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. కూటమి నేతలు, ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని మరమ్మతులు చేయించి పూర్వ వైభవం తీసుకురావాలని పాఠకులు కోరుతున్నారు.



వరండాలో శ్లాబు శిథిలం

పూర్వ వైభవం తీసుకురావాలి



గతంలో నాతవరం గ్రంథాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఈ గ్రంథాలయంలో చదువుకున్న అనేక మంది ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో స్థిరపడ్డారు. ఇటీవల నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగ యువకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఆశిస్తున్నాం

– వై.సందీప్, నిరుద్యోగ యువకుడు, చమ్మచింత

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం పార్టీ కార్యాలయంలో సోమవారం, నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామ, బూత్ కమిటీలను పటిష్టంగా పనిచేసేలా నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ నాయకులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మండలస్థాయి నాయకులు నివేదిక తయారు చేయాలన్నారు. ఆ సమస్యలపై భవిష్యత్తు కార్యచరణ రూపొందించి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారం దిశగా పని చేద్దామన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో వందలాది హామీలిచ్చి ఒకటి ఆరా అరకొరగా అమలు చేసి అన్ని హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. నమ్మిన ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 14 నెలల కాలంలో రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాలా తీసే పరిస్థితులు తీసుకువచ్చారని విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో జరుగుతున్న మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు లోచల సుజాత, ఎంపీపీలు సాగిన లక్ష్మణ్ మూర్తి, మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు ఫణిశాంతారామ్, నాగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ పైల సునీల్, గోపి, మేధావుల సంఘం నాయకులు సిరసపల్లి నర్సింగరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కరక రాజు, మంకు సాంబమూర్తి, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జీల అధ్యక్షులు సుర్ల శేఖర్, వైస్‌ఎంపీపీ సుర్ల బాబ్జి పాల్గొన్నారు.



నాతవరం, గొలుగొండ సమావేశాల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ఎరువుల దుకాణాల తనిఖీ

బుచ్చెయ్యపేట : మండలంలోగల సీతయ్యపేట, రాజాం ఎరువుల దుకాణాలను మండల అధికారులు సోమవారం తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, ఎంపీడీవో భానోజీరావులు రెండు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రెండు దుకాణాల్లో కూడా యూరియా లేనట్టు గుర్తించారు. యూరియాను ఎవరైనా బ్లాక్ చేసినా, ఎక్కువ ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై రైతులు ఫిర్యాదులు చేయవచ్చన్నారు.



రాజాంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

యలమంచిలి రోడ్డు నిర్మాణానికి చర్యలు

మాకవరపాలెం: మండలంలోని రామన్నపాలెం జంక్షన్ నుంచి యలమంచిలి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు నర్సీపట్నం, అనకాపల్లి ఆర్డీవోలు వి.వి.రామణ, షేక్ అయిషా తెలిపారు. రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో ఉన్న యరకన్నపాలెం భూములను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ రెవెన్యూలో ఉన్న అటవీ, రెవెన్యూ శాఖలకు చెందిన మ్యాపులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో రమణ మాటట్లాడుతూ యరకన్నపాలెం నుంచి యలమంచిలి మండలం పెదపల్లి వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవున అటవీశాఖకు చెందిన భూమిలో రోడ్డు నిర్మించాల్సిఉందన్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖకు 737లో ఉన్న రెవెన్యూ భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉండేందుకు యలమంచిలి హైవేను కలుపుతూ రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు.



రెవెన్యూ, ఫారెస్ట్ మ్యాపులను పరిశీలిస్తున్న ఆర్డీవోలు

వీరనారాయణంలో కుక్కల బెడద

మాడుగుల రూరల్ : వీరనారాయణం గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా వుంది. గ్రామంలో సుమారు 150 వీధి కుక్కలు సంచరిస్తూ చిన్న పిల్లలను కరిచి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ చిన్నారితో పాటు గ్రామంలో మరికొందరిని ఇటీవల కుక్కలు దాడి చేసి గాయపర్చగా వారిని కె.జె.పురం పీహెచ్‌సీకి తరలించారు. కుక్కల బెడద తప్పించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిని కోరుతున్నారు.



వీరనారాయణం గ్రామంలో తిరుగుతున్న కుక్కలు

పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లింపు

రావికమతం: కొత్తకోట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు సోమవారం అందజేశారు. వారికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందని విషయమై ఎంపీడీవో దృష్టికి రాగా ఆయన పంచాయతీ రికార్డులను సోమవారం పరిశీలించారు. పంచాయతీ ఖాతా నుంచి డ్రా చేసి పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందజేశారు. అనంతరం టి.అర్జాపురం రైతు సేవా కేంద్రం సందర్శించారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. పి.పొన్నవోలులో డ్వాక్రా మహిళలకు తుని సంతలో కొనుగోలు చేసి పంపిణీ చేసిన పాడి పశువులను ఆయన పరిశీలించారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం..



బంకమట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు



నర్సీపట్నం విద్యార్థులకు వినాయక మట్టి ప్రతిమలను అందజేస్తున్న కరస్పాండెంట్ సతీష్



కె.కోటపాడులో ఎంఈవో సత్యనారాయణ, ప్రసాద్‌లకు మట్టి విగ్రహాలను అందిస్తున్న విద్యార్థినులు



మాడుగుల : వారపు సంతలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు



కె.జె.పురంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు : పర్యావరణ మేలు కోరుతూ మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పూజలను అందించాలని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో సోమవారం మట్టి విగ్రహాల తయారీని చేపట్టారు. ఈ మట్టి విగ్రహాలను కె.కోటపాడులో గల పలు మండల స్థాయి అధికారులకు విద్యార్థుల చేతుల మీదుగా అందించారు. ఆయా విద్యార్థులను అధికారులు అభినందించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతుల మీదుగా 1001 విగ్రహాలు పంపిణీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన వస్త్ర వ్యాపారి పుట్టా కళ్యాణరాజు వెంకటలక్ష్మి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో వినాయక మట్టి విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ చేశారు.

మాడుగుల : భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా 1000 మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. 12 ఏళ్లుగా మండలంలో సుమారు 4 వేలు మట్టి విగ్రహాలు పంపిణీ చేసి పర్యావరణాన్ని కాపాడుతున్న ట్రస్టు సభ్యులను గ్రామ పెద్దలు అభినందించారు. ర్యక్రమంలో ఎంపీపీ వెంకట రాజారామ్, సర్పంచ్ కళావతి, జెడ్పీటీసీ రమణమ్మ, మాజీ సర్పంచ్ సూర్యారావు, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, పుప్పాల రమేష్, భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : రిషీ కళాశాల యాజమాన్యం వారు మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్ విద్యార్థులకు విగ్రహాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను పూజించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆర్.వై.నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పట్టణ వ్యాపారులు వెలగా నారాయణరావు, రాయుడు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

పీజీఆర్‌ఎస్‌లో 21 ఫిర్యాదులు



ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు



తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేస్తున్న దళిత, రైతులు, నేతలు

నర్సీపట్నం : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 21 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. నక్కపల్లి భూ నిర్వాసితులు పునరావాసం కల్పించమని సుమారు వంద మంది ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ కొంత మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. పీజీఆర్‌ఎస్ అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి, సీడీపీవో జి.వి.రమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్వారీ లీజు రద్దు చేయాలి

మాకవరపాలెం: జీకోడూరులో క్వారీ లీజును రద్దు చేయాలంటూ తహసీల్దార్ వెంకటరమణకు దళిత రైతులు ఫిర్యాదు చేశారు. జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో నల్లరాతి క్వారీ నిర్వహణకు లీజులు ఇచ్చిన సంగతి తెలిసిందే. సమీప దళిత రైతులు తమ పంట భూములకు నష్టం కలిగించే క్వారీని రద్దు చేయాలని కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దళిత రైతులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం ఆగదని బహుజన ఐక్య వేదిక నాయకుడు బొట్టా నాగరాజు అన్నారు. కార్యక్రమంలో అత్తుమూరి అప్పారావు, అల్లంపల్లి వెంకటరమణ, పెంటయ్య పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

చీడికాడ : ఖండివరం గ్రామంలో తన సొంత స్థలం చుట్టూ వేసిన పోల్స్‌ను ధ్వంసం చేసిన వ్యక్తుల మీద చర్యలు తీసుకోవాలని ఖండివరం గ్రామానికి చెందిన వేచలపు కామేశ్వరావు స్థానిక తహసీల్దారుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన శీరంరెడ్డి వరహామూర్తి, నుంచి సుమారు 96.8 చదరపు గజాలు ఖాళీ స్థలాన్ని ఈ నెల 11న కొనుగోలు చేయడం జరిగిందని, అనంతరం ఈ స్థలం హద్దుల్లో వీఆర్‌ఓ, ప్రభుత్వ సర్వేయరు సమక్షంలో ఈ నెల 20న సిమెంటు పోల్స్‌ను వేసుకున్నట్టు తెలిపారు. అనంతరం తాను కుటుంబం దగ్గరకు విశాఖ వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన శీరంరెడ్డి సూర్యనారాయణ భార్య రమణమ్మ, శీరంరెడ్డి పార్వతీశం ఆ పోల్స్‌ను పడగొట్టి, తన స్థలానికి ఉత్తరం వైపు మూడు అడుగులు, పడమర వైపు ఖాళీ స్థలంలో ముళ్ల కంచెలతో లోపలికి వెళ్లకుండా దడి ఏర్పాటు చేశారని అన్నారు. ధ్వంసం చేసిన సిమెంట్ పోల్స్ విలువ సుమారు రూ 30వేలు వుంటుదని, నా స్థలాన్ని కబ్జా చేయడానికి వారు ఉత్తరం వైపు పోల్స్ కూడా వేశారని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు అందజేసిన ఫిర్యాదులో వేడుకున్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ

బుచ్చెయ్యపేట : ఐయితంపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ముచ్చకర్ల క్రిష్ణమూర్తి దొంగతనం కేసులో అన్యాయంగా ఇరికించారని ఈ నెల 4వ తేదీన గడ్డిమందు తాగగా ఆగస్టు 15వ తేదీన మృతి చెందాడు. అతని సంతాప సభ సోమవారం ఐయితంపూడిలో జరిగింది. కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఎంపీయుపీ స్కూల్‌లో చదువుకున్న అతని స్నేహితులంతా కలిసి పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కృష్ణమూర్తి తండ్రి మహాలక్ష్మి నాయుడు, ఆయన సోదరుడు సత్యారావు చేతుల మీదుగా సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న స్నేహితులు

వర్షంతో వినాయక విగ్రహాల అమ్మకాలకు ఆటంకం

బుచ్చెయ్యపేట : వినాయక చవితి సందర్భంగా సోమవారం పలు గ్రామాల్లో తయారు చేసిన వినాయక విగ్రహాలను అమ్మకాలకు పెట్టారు. సాయంత్రం మూడు గంటల నుంచి చిరు జల్లులతో వర్షం కురిసింది. దీంతో వడ్డాది, సీతయ్యపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో రంగులు వేసి అమ్మకాలకు పెట్టిన వినాయక విగ్రహాలు తడిచిపోతాయని పలువురు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచారు. వర్షంతో కొనుగోలుదారులు రాలేదని విగ్రహాల తయారీదారులు తెలిపారు. మంగళవారం ఒక్కరోజే వినాయక విగ్రహాల అమ్మకాలకు సమయం ఉందని వాతావరణం అనుకూలించకపోతే తీవ్రంగా నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు.



వడ్డాదిలో వర్షం కారణంగా కవర్లు కప్పిన వినాయక విగ్రహాలు

సామాజిక సేవా కార్యక్రమాలతో మన్ననలు

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ జన్మదిన వేడుకలకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్ననలను పొందాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా కోరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ మహిళా విభాగం సీనియర్ నాయకురాలు కాండ్రేగుల హైమావతి, రమణబాబు దంపతులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, పీడీ గాంధీ, సిద్ధార్థ, పెంటకోట శ్రీను, నీటపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, తగరంపూడి నూకరత్నం, నీలకంఠం లక్ష్మి పాల్గొన్నారు.



రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న మలసాల కుమార్‌రాజా, పార్టీ శ్రేణులు

పేద విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు

రావికమతం: మండలంలోని కవగుంట పంచాయితీ శివారు బుడ్డిబంద గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని గోళ్ల జగన్‌మోహిని ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. జగన్‌మోహిని 2025 సంవత్సరంలో జరిగిన నీట్ పరీక్షలలో 720 మార్కులు 404 మార్కులు సాధించి 3052 ర్యాంక్‌తో ఎస్టీ కేటగిరిలో రాజమండ్రి జీఎస్ఎల్ఆర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. జగన్‌మోహిని తండ్రి అప్పన్నదొర ఏడేళ్ల కొందట మృతి చెందాడు. తల్లి ముత్యాలమ్మ కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివించింది. జగన్‌మోహిని 1 తరగతి నుంచి 5 తరగతి వరకు బుడ్డిబంద ప్రాథమిక పాఠశాల, ఆరు నుంచి ఇంటర్ వరకు మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌లో చదివింది. ఎంబీబీఎస్ సీటు సాధించిన జగన్‌మోహినిని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, స్నేహితులు అభినందించారు.



గోళ్ల జగన్‌మోహిని

క్లుప్తంగా

కొండలఅగ్రహారంలో నేడు ఉచిత వైద్య శిబిరం

మాకవరపాలెం : మండలంలోని కొండలఅగ్రహారంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇక్కడి గాయత్రి విద్యా మందిర్ వద్ద జరగనున్న వైద్య శిబిరానికి విశాఖ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు హాజరు కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కంటి, స్త్రీలు, గుండె, చిన్నపిల్లలు, సాధారణ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఆధార్ కార్డుతో శిబిరానికి హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ లైను మరమ్మతు పనుల రీత్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.వి.ఎన్.ఎం అప్పారావు తెలిపారు. నర్సీపట్నం డివిజన్ రోలుగుంట సబ్‌స్టేషన్ పరిధిలో గల రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయడుపాలెం, చెట్టుపల్లి గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వినాయక విగ్రహాల కొనుగోళ్ల సందడి



ఏఎల్‌పురంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

గొలుగొండ : మన్యం ముఖ ద్వారం అయిన ఏఎల్‌పురంలో వినాయక విగ్రహాల అమ్మకాలు సోమవారం జోరందుకున్నాయి. ఇక్కడ మూడు చోట్ల భారీ వినాయక విగ్రహాలు అందుబాటు ఉంచారు. చిన్న విగ్రహాల నుంచి సుమారుగా 9 అడుగుల విగ్రహాలు సైతం తయారు చేశారు. ఏఎల్‌పురం నుంచి గొలుగొండ మండలం వరకే కాకుండా అల్లూరి జిల్లా చింతపల్లి, కొయ్యూరు, గూడెం కొత్తవీధి వరకు ఇక్కడ విగ్రహాలు కొనుగోలు చేసి తరలిస్తారు. బుధవారం చవితి కావడంతో సోమవారం విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి.

జోరుగా వరినాట్లు.. కూలీలకు డిమాండ్



వీరనారాయణంలో వేసిన వరినాట్లు

మాడుగుల రూరల్: ఈ నెల 15, 16, తేదీల్లో కురిసిన వర్షాలకు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. వెద పద్ధతిలో కాకుండా మెట్ట భూముల్లో ప్రస్తుతం వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. దీంతో ఆడ కూలీలకు డిమాండ్ పెరిగింది. తాచేరు, పెద్దేరు, జలాశయాల పరిధిలో గల పంట భూముల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావొచ్చు...



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి

కె.కోటపాడు : ప్రాణాపాయ పరిస్థితుల్లో అవసరార్థులకు దాతలు ఇచ్చే రక్తం ప్రాణాన్ని నిలబెట్టనున్నట్టు కె.కోటపాడు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డి.శ్రీలక్ష్మి అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో కె.కోటపాడుతో పాటు సమీప గ్రామాల నుంచి యువకులు, దాతలు వచ్చి రక్తాన్ని అందించారు. రక్తదాతలను సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి అభినందించారు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్‌ల నాగేశ్వరరావు, రవి, వైద్యులు వైదేహి, రమ, మహేష్, సునీల్, ప్రశాంత్, మానస, సురేంద్ర పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కశింకోట: స్థానిక కోడికూర రెస్టారెంట్‌పైన శ్రీనివాస ఫంక్షన్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగ లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భరత్‌కుమార్ తోపాటు మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, యలమంచిలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తదితరులు హాజరు అవుతారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.